IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)

An International Open Access, Peer-reviewed, Refereed Journal

# ‘భాస్కర శతకంలో– గార్డన్ విలార్డ్ అల్పోర్ట్ వ్యక్తిత్వ వికాస సూత్రాలు’- ఒక అనువర్తిత పరిశీలన

డా .ఎం. .వి .పట్వర్ధన్ ,అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల చెన్నూరు ,మంచిర్యాల,తెలంగాణ రాష్ట్రం, భారత్, 504201

**వ్యాస సంగ్రహం :**తెలుగు సాహిత్యంలో శతకం ఒక ప్రత్యేకసాహిత్య ప్రక్రియకు చెందినది .ఏ వేమన పద్యమో ,సుమతీ పద్యమో నోటికి రాని తెలుగువాళ్ళు నిన్న మొన్నటి వరకూ ఉండేవాళ్ళు కాదు .తెలుగులో పాల్కురికి సోమనాథుడు రచించిన‘ బసవా బసవా వృషాధిపా ’శతకం మొట్టమొదటి సర్వ లక్షణ సమన్వితమైన శతకంగా భావించబడుతుంది . ఆ తరువాత ఆనాటి నుండి ఈనాటి వరకూ తెలుగులో అనేకానేక శతకాలు వెలువడ్డాయి .వాటి వాటి సామర్థ్యాన్ని బట్టి ప్రజల నోళ్ళల్లో నానుతూనే ఉన్నాయి .గతంలో డా .కే.గోపాల కృష్ణ రావు‘ ఆంధ్ర శతక వాఙ్మయవికాసం ’ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పి .హెచ్ .డి సిద్ధాంత వ్యాసాన్ని వెలయించారు .శతక సాహిత్యంపై ఇది అత్యంత ప్రామనైకమైన గ్రంథమే అయిన ప్పటికీ ,దీనిలో వ్యక్తిత్వ వికాస కోణం నుంచి పరిశోధన జరగలేదు .కిరణ్‘ శతకాలు– వ్యక్తిత్వ వికాస మార్గ దర్శక సూత్రాలు ’అనే శీర్షిక క్రింద జాగృతి పత్రికలో3 /5/2021లో ఒక వ్యాసం వెలయించారు .ఈ వ్యాసం ప్రస్తుత పరిశోధనాంశం శీర్షికతో పోలి ఉన్నప్పటికీ ,దీనిలో సుమతీ శతకంలోని కొన్ని పద్యాలు మాత్రమే ఉటంకితమైనాయి .ఇంకా కొన్ని వ్యాసాలు శతకాల్లోని నైతిక ,సామాజిక దృక్పథానికి పరిమితం అయ్యాయి .కాబట్టి తెలుగులో వచ్చిన ప్రాచీన నీతి శతకాలైన సుమతీ ,భాస్కర,వేమన , కుమార,కుమారీ శతకాల్లోని నీతులను ఆధునిక వ్యక్తిత్వ వికాససూత్రాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది .భాస్కర శతకాన్ని కేంద్రంగా చేసుకొని ,ఆధునిక వ్యక్తిత్వ వికాస సూత్రాలకు అనువర్తింపజేస్తూ ,పరిశీలన సాగాల్సిన అవసరాన్ని ,ఈ వ్యాసం కొంత పూర్తిచేస్తుంది .ఈ పరిశోధనావ్యాసం ప్రదానంగా గుణాత్మక విశ్లేషణ విధానం ద్వారా జరుగుతుంది .

**కీలక అంశాలు :**భాస్కర శతకం – మారద వెంకన – భాస్కరా -నైతికత -సామాజికత -వ్యక్తిత్వ వికాసం

## 1.ఉపోద్ఘాతం

కావ్య ప్రయోజనాన్ని“కావ్యం యశసేర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే సద్య :పర నిర్వృతయే కాంతాసమ్మిత తయోపదేశయుజే ”[1]అని అనేక విధాలుగా చెప్పారు .ఇందులో‘ శివేతరక్షతయే ’అంటే అమంగళకరమైన మార్గాన్నుంది రక్షించడం ,అట్లాగే ఉపదేశం అనే ఈ రెండు ప్రయోజనాలను ,కావ్యం లాగానే, ఇంకా చెప్పాలంటే అంతకంటే మిన్నగా శతకం నిర్వహిస్తుంది .

తెలుగులో శతకాలను ప్రధానంగా భక్తి ,నీతి శతకాలుగా విభజించుకోవచ్చు .నీతి శతకాలు సమాజాన్ని ప్రతిబింబిస్తాయి.“భక్తి శతకములు, తాత్విక శతకములు, కేవలము ముముక్షువుల కుద్దేశింపబడినట్టివి .నీతి శతకములు పూర్వ గ్రంథములను, లోకానుభవమును, ఆధారముగా చేసుకొని ఇహ జీవితమును పురస్కరించుకొని రచింపబడినట్టివి . ఇందలి నీతులు మానవసంఘ మందలి వివిధ వ్యక్తులకు సంబంధించినవి .కనుక నీతి శతకములు సర్వజన హితకరములైనవి. మానవుడు ఏ రకంగా జీవించాలో ,ఏ రకంగా సుఖశాంతులను పొందాలో ,ఉదాహరణలతో సహా వివరిస్తాయి .ఈనాడు చాలామంది వ్యాపార దృష్టితో చెప్పే‘ పర్సనాలిటీ డెవలప్మెంట్”కు సంబంధించిన కీలకమైన అంశాలన్నీ మనకు శతకాల్లో యథాతథంగా నిత్య జీవితంలోని ఉదాహరణలతో సహా కనిపిస్తాయి .

శతకం పద్య ప్రక్రియకు చెందినదైనా ,అందులోనూ వేమన ,సుమతీ,భాస్కరా మొదలైన శతకాలు ప్రాచీనకాలాల్లో వ్రాయబడినవైనా ,ఆయా శతకాల్లో పేర్కొన్న నైతిక అంశాలు ,సామాజిక ప్రవర్తనా విధానాలు ,ఆధునిక కాలానికి కూడా ఎలా సరిపడి ఉన్నాయో ,అవి ఈనాడు వ్యక్తిత్వ వికాసం పేరిట శాస్త్రీయంగా చెలామణి అవుతున్న అంశాలతో ఎలా సంవదిస్తున్నాయో పరిశీలిస్తే చాలా ఆశ్చర్యమనిపిస్తుంది .

**భాస్కర శతక కర్త పరిచయం** :మారదవెంకయ్య) 1550-1650 (కవి తన ఇష్ట దైవం సూర్యభగవానుడి పేరు మీద 'భాస్కరా'అనే మకుటంతో రచించిన శతకం తెలుగులోని నీతి శతకాల్లో చాలా ప్రసిద్ధమైంది .ఇందులో దృష్టాంత అలంకారాన్ని ప్రయోగించి ,మొత్తం 116 పద్యాలు వ్రాయబడ్డాయి .ఇందులో 64ఉత్పల మాల పద్యాలు ,42 చంపకమాల పద్యాలు కలిపి మొత్తం 116 పద్యాలున్నాయి ."తెలుగు శతకములలో దృష్టాంత శతకములు విశిష్టములైనవి .అందు భాస్కర శతక మాద్యమైనది .[3]"నైతిక మూల్యాల గూర్చి,సామాజిక కట్టుబాట్ల గూర్చి ఇందులో వివరించబడింది .

## 2. ఆధునిక వ్యక్తిత్వవికాస సూత్రాలు- భాస్కర శతకం

ఏ విధంగా సిగ్మండ్ ఫ్రాయిడ్ ను మనం మనస్తత్వశాస్త్రాన్ని అభి వృద్ధి చేసిన వారిలో ముఖ్యుడిగా చెప్పుకుంటున్నామో ,అదేవిధంగా గార్డన్ ఆల్పోర్ట్ ,)1897-1967(వ్యక్తిత్వ వికాస మనస్తత్వశాస్త్రాన్ని అభివృద్ధి చేసిన వారిలో ముఖ్యుడిగా చెప్పుకుంటాం.

"Allport pioneered research on human personality. At a time when behaviorism held sway in psychology departments in the U.S., and psychoanalytic approaches dominated elsewhere, Allport championed an empirical methodology that considered the influences of current context and conscious motivations, without dismissing the possible contribution of unconscious memories and/or mechanisms to human thought and behavior"[4] అని అల్పోర్ట్ ప్రత్యేకతను చెప్పుకుంటారు .

గార్డన్ అల్పోర్ట్ చెప్పిన వ్యక్తిత్వ వికాస సూత్రాలను , ప్రాచీన సాహిత్యానికి అనువర్తింప జేసి, భాస్కర శతకంలో వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన సాధారణ సూత్రాలేమిటో పరిశీలించడమే ఈ పరిశోధనావ్యాస ఉద్దేశ్యం .గార్డన్ అల్పోర్ట్ ఉత్తమమైన వ్యక్తిత్వ వికాసానికి ముఖ్యంగా ఆరు అంశాలను ప్రతిపాదించాడు .అవి

**1( స్వీయభావ విస్తరణ2 ( స్నేహపూర్వక సంబంధాలు3 ( భావోద్వేగ భద్రత4 ( వాస్తవ దృష్టి5 ( స్వీయ పరిశీలన6 ( సమగ్ర జీవన తత్వం**

**2.1. <u>స్వీయభావ విస్తరణ:</u>** మనసు పరిణామం చెందుతున్న కొద్ది ,మనిషి నేను,నాది అనే సంకుచిత భావాలనుంచి బయట పడి ,మేము,మాది అనే భావాల వైపు పయనించదాన్ని స్వీయ భావ విస్తరణ అంటారు .దీనిని ఇంకొక మాటలో చెప్పాలంటే" పరోపకారార్థ మిదం శరీరం "అన్న మన పూర్వీకుల భావనకు మరో రూపంగా భావించవచ్చు .ఈ భావమే

"బంధుర సద్గుణాఢ్యుదొక పట్టున లంపట పొంది యైన దు
స్సంధి ఘటింప దన్యులకు జాల హితం బొనరించు గాక ,శ్రీ
గంధపు జెక్క రాగిలుచు గాదె ,శరీరుల కుత్సవార్థమై
గంధము లాత్మ బుట్ట తరగం బడి యుండుట లెల్ల భాస్కరా) !70("

అన్న పద్యంలో కనబడుతుంది .తన స్వంత అస్తిత్వాన్ని కూడా లెక్క జేయని గొప్ప పరోపకార బుద్ధికి సంకేతంగా ,తానూ తరిగిపోతూ కూడా ,ఇతరులకు సువాసనలనిచ్చే గంధపు చెక్క చూపబడింది .స్వార్థాన్ని త్యాగం చేసి ,వ్యక్తి చైతన్యం సమష్టి చైతన్యం వైపుగా పయనించాలని ఈ పద్యం చెపుతున్నది .ఇలా స్వీయభావవిస్తరణ చేసుకోగలినప్పుడే , మంచివ్యక్తిత్వం నిర్మాణమౌతుంది .

**<u>2.1.2. తన వలన ఇతరులకు మేలు జరగాలనే ఆలోచన</u>** :తన వలన ఇతరులకు మేలు కలగాలనే ఆలోచన వచ్చినప్పుడు ,తన జీవితం తనకు మాత్రమే కాక , సమాజానికి అందరికి చెందిందని మనిషి ఆలోచించగలగాలి .ఈ భావం" అలఘు గుణప్రసిద్ధు డగునట్టి ఘనుం డొక....భాగ్యము నాతని కీడె భాస్కరా ) !08(" అన్న పద్యంలో ప్రతిఫలించింది .కృష్ణుడు తన మిత్రుడైన కుచేలుడి పిడికెడు అటుకులను తిని ,అతడికి చాలా సంపదలిచ్చినట్లు , సజ్జనుడు తన వలన ఇతరులు తనకు ఏమిచ్చారని చూడకుండా ,తన వలన తానుచేయగల్గినంత మేలు చేయాలని ఆశిస్తాడు .దీని వలన స్వీయభావ విస్తరణ సాధ్యం అవుతుంది .

**<u>2.1.3 సామాజిక బాధ్యత</u>** :మానవుడికి సామాజిక బాధ్యత ఉంటుంది ."మానవుడు సామాజిక జంతువు 'అని అరిస్టాటిల్ అన్నట్లు ,తాను సమాజం పట్ల బాధ్య వహించాల్సి ఉందని అనుకోవడం స్వీయ విస్తరణలో ముఖ్య భాగం . ఈ భావాన్ని "ఒక్క డె చాలు నిశ్చల బలోన్నతుడెంతటి కార్యమైన ....యొక్క కిరీటి భాస్కరా) !26(" అన్న పద్యం తెలియజేస్తుంది . కౌరవులు విరాట మహారాజు గోవులను తోలుకొని పోతుండగా,ఒక్క అర్జునుడే సాహసించి ,వారిని ఎదుర్కొని గోవులను కాపాడాడు .ఇలా స్వీయవిస్తరణ భావం పెరుగుతుంది .

**<u>2.2 స్నేహపూరిత సంబంధాలు</u>**: ఇతరులతో మంచి స్నేహపూరిత సంబంధాలు కలిగి ఉండడం, వ్యక్తిత్వ నిర్మాణంలో చాలా ముఖ్యం .ము ఖ్యంగా ఈ స్నేహం లేదా సాంగత్యం సజ్జనులతో కలిగినప్పుడు ,తప్పకుండా ,వారి సత్ప్రభావం మన మీద పడుతుంది .మన ఆలోచనలు నేను నుండి మనం దాకా విస్తరించడానికి సజ్జనసాంగత్యం మనకు తప్పకుండా సహాయపడు తుంది .మనను దోషమార్గం వైపు నడవకుండా సజ్జన సాంగత్యం కాపాడుతుంది .ఈ భావమే" తెలియని కార్య మెల్ల గడతేర్చుట కొక్క వివేకి జేకొనన్ -వలయున ...నరుండది జూచి భాస్కరా)50(" అన్న పద్యంలో మనం తిలకధారణ చేసేటప్పుడు చేతిలో అద్దం ఉంటే ,ఎలాంటి పొరపాటు లేకుండా ,సరిగ్గా ఎలా పెట్టుకుంటామో ,అలా మంచి నేర్పరి లేదా సజ్జనుడి సహాయం తీసుకుంటే ,మనసుండి ఎలాంటి తప్పూ దొరలకుండా, సహాయంగా ఉంటాడని ప్రతిపాదించ బడింది .

**2.2. 1మమతానురాగాలు :**మానవుడి సహజ స్వభావం ప్రేమించడం .ప్రేమకు ఎలాంటి ఆంక్షలు ఉండవు .పరిణత వ్యక్తిత్వం కల మనుషులు ,ఎలాంటి వారిపైన అయినా ,తమ ప్రేమానురాగాల్ని కురిపించగలుగుతారు .

"మది దను నాసపడ్డ యెడ మంచి గుణోన్నతు డెట్టి హీనునిన్

వదలడు మేలుపట్టున నవశ్యము మున్నుగ నాదరించుగా

త్రిదశ విమాన మధ్యమున దెచ్చి కృపామతి సారమేయముల్

మొదల నిడండె ధర్మజుడు మూగి సురావళి జూడ భాస్కరా) !79("

అన్న పద్యంలో మహాభారతం స్వర్గారోహణ పర్వంలోని మహాప్రస్థానం ఘట్టం ధర్మరాజు తన ననుసరించి వచ్చిన కుక్కను, అపూర్వమైన ప్రేమతో స్వర్గానికి తీసుకువెళ్ళాడనే విషయం ప్రస్తావించబడింది .అందరిపట్లా ఆదరాభిమానాలు కలిగి ఉండడం పరిణత వ్యక్తిత్వానికి ఒక సూచిక !

**2.2. 2గౌరవం** :సమాజంలో నిజమైన గౌరవం కేవలం బాహ్యలక్షణాలను బట్టి, పైనకు కనబడే సౌందర్యాన్ని బట్టి లభించదు .అంతర్గత లక్షణాల వలన మాత్రమే లభిస్తుంది .

"పూరిత సద్గుణంబు గల పుణ్యున కించుక రూపసంపదల్...లోకులు గొంట భాస్కరా) !66(" అనే పద్యంలో ఈ భావానికి సంబంధించిన ప్రస్తావన కనబుతుంది .ఖర్జూరపు పండ్లు పైనకు చూడ్డానికి , ముడతలు పడి ఉన్నప్పటికీ, వాటి మాధుర్యాన్ని చూసి మాత్రమే , ప్రజలు కొనుక్కుంటారు .ఇదేవిధంగా సద్గుణ వంతుడికి సౌందర్యం లేకపోయినప్పటికీ, విజ్ఞులైన వారు గౌరవిస్తారు .

**2.2.3 క్షమాగుణం :**మానవుడి ఉత్తమమైన వ్యక్తిత్వానికి క్షమాగుణం ఒక మంచి ఉదాహరణ .వేమన కూడా "చంపదగిన యట్టి శత్రువు తన చేత– చిక్కెనేని కీడు చేయవలదు– పొసగ మేలు చేసి పొమ్మనుటే చాలు "అంటాడు .ఇలాంటి భావమే

"ఉరు గుణవంతు డొర్లు దన కొండొపకారము సేయునప్పుడున్...తాలిమి నీయడె వెన్న భాస్కరా) !15(" అన్న పద్యంలో కనబడుతుంది .మానవుడు పెరుగును కవ్వంతో ఎంతగా చిలికినప్పటికీ అది, ఓర్పుతో సహించి, వారికి వెన్నె ఇచ్చినట్టే, గుణవంతుడు తనకు ఎవరైనా కీడు చేసినప్పటికీ ,తాను వారికి తిరిగి అపకారం చేయక, క్షమించి, వారికి ఉపకారమే చేస్తాడు.ఇట్లా క్షమించగల్గడం నిజంగా మహోదాత్త గుణం .

**2.2.4 సహకారం :**వ్యక్తిత్వవికాసగుణాల్లో సహకార గుణం చాలా ముఖ్య మైంది .ఈ సహకారం కూడా పాత్రాపాత్ర విచక్షణా గుణంతో చేయాలి.

"సిరిగల వాని కెయ్యెడల చేసిన మేలది నిష్ఫలంబగున్...గుర్వగ నేమి ఫలంబు భాస్కరా) !100(" అన్న పద్యంలో మేఘాలు వాడిపోయిన చేల మీద కురిస్తే లాభం కానీ, సముద్రంలో కురిస్తే లాభం ఉండదని చెప్పబడింది .

**2.2.5 స్వార్థరహిత సేవ :**సేవే సర్వోత్కృష్ట ధర్మం ."మానవ సేవే మాధవ సేవ 'అన్నారు .కదా !ఈ సేవాధర్మాన్ని గూర్చి "పరహితమైన కార్య మతిభారము తోడిది ..చక్రము భాతి భాస్కరా) !61(" అన్న పద్యంలో వివరించాడు మారద వెంకయ్య కవి .పరులకు హిత కలగాలన్న ఒకే ఒక కోరికతో ,ఇంద్రుడు రాళ్ళ వర్షాన్ని కురిపిస్తూన్నా ఏమాత్రం బెదరకుండా, కృష్ణుడు గోవర్ధన గిరిని ఒంటిచేతితో గొడుగు లాగా పైనకు ఎత్తి ,గోవులను ,గోపబాలురను రక్షించాడు .స్వార్థ రహితంగా సేవ చేయడం గొప్ప వ్యక్తిత్వ వికాస సూత్రం .

**2.3 భావోద్వేగ భద్రత** :భయం.కోపం ,అసూయ ,ఉద్రేకం మొదలైనవన్నీ మానవులకు సహజ ఉద్వేగాలు.అయితే వీటికి లొంగక ,స్వీయ సమీక్షతో ,వీటిని అదుపులో పెట్టుకోవడంలోనే ,ఉత్తమ వ్యక్తిత్వం వికసిస్తుంది .

"పలుచని హీన మానవుడు పాటి దలంపక నిష్ఠురోక్తులన్

బలుకుచు నుండు గాని,మతి భాసురుడై సుగుణ ప్రపూర్ణుడ

ప్పలుకుల పల్క బోవడు నిబద్ధిగ ,నెట్లన వెల్తికుండ దా

దొలుకుచు నుండు గాని మరి తొల్కునె నిండు ఘటంబు భాస్కరా) !62(

అన్న పద్యంలో' వెలితిగా ఉన్న కుండ తొణుకుతుంది 'నిండుకుండ ఏ మాత్రం తొణికిసలాడదు 'అన్న భావాన్ని ప్రకటించే పద్యం దీనికి' ఉద్వేగ నియంత్రణకు మంచి ఉదాహరణ .

**2.3.1 కోప నియంత్రణ :**కోపం మనిషిని అనేకవిధాలుగా నష్టానికి గురిచే స్తుంది .మంచి వ్యక్తిత్వ వికాసంలో కోపం లేదా ఆగ్రహాన్ని అదుపులో పెట్టుకోవడం చాలా ముఖ్యం .'తడవగ రాదు దుష్టగుణు దత్వమెరుంగక... భగ్గున మండకయున్నె భాస్కరా) !47 (అన్న పద్యంలో బాగా కాగిన నూనె నీటి చుక్క పడ్డ వెంటనే, పైకి లేచి మంట భగ్గుమంటుంది .ఇదేవిధంగా దుష్టుడు కూడా తనకు హితం చెప్పిన వారి మీదకు లేచి ,వారికి చెడు చేయాలనుకుంటాడు .కాబట్టి ఒకరి గుణం తెలియక వాని జోలికి పోగూడదు .

**2.3.2 సహన భావం :**ఎలాంటి పరిస్థితులు వచ్చినా ,వెనుకంజ వేయక ,సహనాన్ని చూపి ,పరిస్థితిని అనుగుణంగా మార్చుకోవడం మంచి వ్యక్తిత్వా నికి ఉదాహరణ .'తాలిమి తోడ గూరిమి కృతఘ్నున కియ్యెడ.... హెచ్చును గాక భాస్కరా ! )49('అన్న పద్యంలో సజ్జనుడు శాంతము ,ప్రేమభావంతో కృతఘ్నునకు మేలుచేస్తే ,ప్రతిఫలంగా కీడు కలుగుతుంది,అయినప్పటికీ సజ్జనుడు సహనంతో వ్యవహరించాలి .

**2.3. 3సమయోచిత ప్రవర్తన :**పరిస్థితులకు అనుగుణంగా మనిషి నడుచు కోవాలి .సమయాన్ని బట్టి పట్టువిడుపులు ఉండాలి .'ఉరుకరుణాయుతుండు సమయోచిత మాత్మ దలంచి .... నశేష జనంబు లెరుంగ భాస్కరా) !14 (పద్యంలో మొదట భయం కలిగించే విధంగా ఉరిమిన మేఘం ఆ తరువాత

అందరికి సంతోషం కలిగించే విధంగా వర్షిస్తుంది .మానవుడు కూడా పరిస్థితిని బట్టి , ఒక్కోసారి కఠినమైన మాటలు మాట్లాడినప్పటికి ,ఆ తరువాత అందరిని కలుపుకొని పోయే మాటలు మాటలు మాట్లాడాలి .దీని వలన సంబంధాలు పెరుగుతాయి .

**2.3. 4అహంకార నియంత్రణ :**అన్ని ఉద్వేగాల్లోనూ అహంకారం చాలా అనర్థదాయకమైంది .'తగిలి మడంబుచే ... దగరు ఢీకొని దాకిన నేమి భాస్కరా)!46(' అన్న పద్యంలో గొర్రె పర్వతాన్ని ఢీకొంటే ,దాని తల పగలడం తప్ప ,ఇంకా ఇతర ఫలితం ఏమీ ఉండదు .కాబట్టి మనిషి తన బలాన్ని ఎక్కువగా ఊహించుకొని ,పెద్దవారితో విరోధాన్ని తెచ్చుకోరాదు .

**2. 4వాస్తవ దృష్టి :**వాస్తవాలపైన ఆధారపడి మాత్రమే మనం ఒక అంచనా కు రావాలి .ఏది మంచిది? ఏదిచెడ్డది? అనే వివేకం తప్పకుండా ఉండాలి.

ఎడ్డె మనుష్య డే మెరుగు నేన్ని దినంబులు గూడి యుండినన్
దొడ్డ గుణాఢ్యు నందు గల తోరపు వర్తన లెల్ల బ్రజ్ఞ బే
ర్వడ్డ వివేక రీతి రుచి పాకము నాలుకగా కెరుంగునే?
తెడ్డది కూరలోగలయ ద్రిమ్మరుచుండిన నైన భాస్కరా) !21.(

అన్న పద్యంలో, కూర తయారుచేసే పాత్రలో ఉన్నంత మాత్రాన, గరిటెకు కూర రుచి తెలియదు .ఈ విధంగానే గుణవంతుడిలో ఉన్న గొప్ప గుణాలను వివేకవంతులు మాత్రమే గుర్తిస్తారు.

**2.4. 1తెలియని విషయాలను గ్రహించడం :**జ్ఞానం అనేది అనంతమైనది ..అన్నీ ఒక మనిషికే తెలియాలని లేదు . తెలియకపోతే తప్పు కాదు కానీ, తెలియని దాన్ని ఎలాంటి భేషజాలు లేకుండా, తెలియదు అని ఒప్పుకోవడం ఒక ఉత్తమ వ్యక్తిత్వానికి నిదర్శనం .ఈ విషయం 50 వ పద్యంలో ప్రస్తావించబడింది .నుదుట తిలకధారణ అద్దం సహాయంతో సరిగ్గా చేసుకున్నట్లే, మనకు తెలియని విషయాలను జ్ఞానుల వద్ద తెలుసుకోవడానికి ఏ మాత్రం సందేహించగూడదు .ఇట్లా చేయడం వలన మనం చేయాలనుకున్న పనులు వేగంగా, నిర్దుష్టంగా అవుతాయి .

**2.4. 2సామర్థ్యానికి తగిన పని :**ఒక వ్యక్తి తన సామర్థ్యానికి తగినట్టుగా

పని చేయాలి .తీక్షణంగా ఉంటూ, దహించే స్వభావం గల అగ్ని దేవుడు ఒక్కోసారి క్షీణించిపోయి మండడు.గాలి ఊదాల్సి వస్తుంది .ఇదేవిధంగా మనం తెలియని విషయా లను తెలుసుకోవడాని మూమాట పడగూడదు.

**2.4. 3అంతర్గత స్వరూపాన్ని వీక్షించడం** :ఒక వ్యక్తిని బాహ్య స్వరూపం ఆధారంగా లెక్క గట్టడం సరికాదు .అంతర్గత మూల్యాంకనం చేయాలి .ఈ భావమే 'ఎప్పు డదృష్టతా మహిమ....నలుపెంతయు బుట్టు భాస్కరా) !22('అన్న పద్యంలో ప్రస్తావించబడింది.కొలిమిలోని నిప్పు తో కూడుకున్న బొగ్గు కాంతివంతంగా కనిపిస్తుంది .నిప్పు ఆరిపోగానే స్వతస్సిద్ధమైన నలుపు రంగులోనే కనిపిస్తుంది .

**2. 5:ఆత్మ పరిశీలన** :స్వీయ పరిశీలన అనేది వ్యక్తిత్వ నిర్మాణంలో ఒక ముఖ్యమైన భాగం .

"తడపగ రాదు దుష్ట గుణు తత్వ మెరుంగక యెవ్వరైన నా
చెడుగుణ మిట్లు వల్వదని చెప్పిన గ్రక్కున కోపచిత్తుడై
గడు తెగ జూచుగా మరుగు గాగిన తైలము నీటి బొట్టుపై
బడు నెడ నా క్షణం బెగసె భగ్గున మండకయున్నె భాస్కరా)! 47("

అనే పద్యంలో తన లోపాలను ఎవరైనా చెప్పినప్పుడు వినని వాడు, నీటి చుక్క పడిన బాగా కాగిన నూనెలా భగ్గున మండిపోతాడు .

**2.5.1: స్వీయ పరిమితులు గుర్తించి,తెలియనిది తెలుసుకోవడం :**'తెలియని కార్యమెల్ల ...అరుండది చూచి భాస్కరా) !50('అన్న పద్యంలో మనిషికి బొట్టు పెట్టుకునే సమయంలో అద్దం లాగా , ఎప్పుడూ ఒక నేర్పరి అయిన వారి మార్గనిర్దేశనం అవసరమని చెపుతారు .

**2. 6సమగ్ర జీవన తత్వం :**ఉత్తమ వ్యక్తిత్వం రూపొందాలంటే, తోటి వారిపై ప్రేమ ఉండాలి .దానమూ,పరోపకార గుణాలు ఉండాలి .ఈ భావాన్ని

"దాన పరోపకార గుణ ధన్యత చిత్తము లోన నెప్పుడున్
లేని వివేక శూన్యునకు లేములు వచ్చిన వేళ, సంపదల్
పూనిన్ వేళ,నొక్క సరిపోలును ,జీకున కర్థరాత్రియం
దైన నదేమిపట్ట పగలైన నదేమియు లేదు భాస్కరా) !52("

అనే పద్యం తెలియజేస్తున్నది .దాన,పరోపకార గుణాలు లేని వాడి జీవితం పుట్టుగుడ్డితో సమానమని, అట్టి వివేకం లేని వారి జవితానికి పెద్దగా అర్థం లేదని తెలియజేస్తుంది .

**2.6. 1ధర్మము -నీతులను పాటించడం :**భాస్కర శతకంలోని అనేక పద్యాలు సార్వజనీనమైన విలువలతోనే ఉన్నాయి .ఆ పద్యాలన్నిటిని నిత్య జీవితంలో మెరుగైన జీవన విధానం కోసం ఉపయోగించ వచ్చు .'పలు మరు సజ్జనుండు ప్రియ భాషల పల్కు కఠోర వాక్యముల్ ,,,నీరము గాక భాస్కరా) !63వ పద్యం (అనే పద్యంలో మేఘం ఎలా పరోపకారమైన పలు కార్యాలు చేస్తుందో చెప్పబడింది .సజ్జనుడు కూడా మేఘం లాగానే మంచి పనులు చేయాలని ఒక మంచి సందేశం ఇచ్చాడు మారద వెంకయ్య కవి .

2.6. 2సుఖ దుఖాలను సమానంగా స్వీకరించడం :వ్యక్తిత్వ వికాసంలో ఇది ముఖ్యమైన భాగం .ఈనాటి సున్నితమైన యువత, కొన్ని అవాంఛనీయ నిర్ణయాలను తీసుకోవడానికి కూడా ఈ భావం లేకపోవడమే ప్రధాన కారణం .'కట్టడ లేని కాలమున గాదు శుభం బొరు లెంత వారు... చోటు భాస్కరా!(29)అన్న పద్యంలో దశరథ మహారాజు నిర్ణయించిన శ్రీరాముడి పట్టాభిషేకం భంగం కావడం ప్రస్తావించబడింది .

**3. ముగింపు**

1.శతకాలు మనకు నిత్య జీవితంలో ఎదురయ్యే ఎన్నో పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో నేర్పిస్తాయి .

2. మనలో ధార్మికత-నైతిక కార్యాచరణ పట్ల మక్కువ పెంపొందిస్తాయి .

3. గార్డన్ ఆల్పోర్ట్,వ్యక్తిత్వ వికాస నిపుణుడు గార్డన్ ఆల్పోర్ట్ సిద్ధాంతాలు భాస్కర శతక పద్యాలకు అనువర్తితం అయ్యాయి .

**4. పాదసూచికలు**

1. మమ్మటుడు,మాధవ రామశర్మ, జమ్మల మడక ,కావ్యాదర్శము , పుట11 ,1953

2. దా.కె.గోపాలరావు, ఆంధ్ర శతక వికాసం, ఆంధ్రసారస్వత పరిషత్తు, పుట376 , 1976

3. డా .నాగయ్య.జి, తెలుగు సాహిత్య సమీక్ష-2,నవ్య పరిశోధక ప్రచురణలు ,తిరుపతి,1995,పుట568

4. Williams James Hail, Gordon W.Alport, Department of Psychology, Harvard University

**5. ఉపయుక్త గ్రంథ సూచి**


1.దా.కె.గోపాలరావు, ఆంధ్ర శతక వికాసం, ఆంధ్రసారస్వత పరిషత్తు,1976

2. శతక మంజరి, ఋషి ప్ర53చురణలు , విజయవాడ,2004

3.దా .సుబ్రహ్మణ్యం. జీ.వి.,తెలుగు లిటరేచర్) సం (,హైదరాబ్ స్టడీ సర్కిల్,హైదారాబాద్,2015

4. డా .నాగయ్య.జి, తెలుగు సాహిత్య సమీక్ష-2,నవ్య పరిశోధక ప్రచురణలు ,తిరుపతి,1995

5. డా .భూమిరెడ్డి గోవిందరెడ్డి ,డా.పొల్లంపాటి గీతానాథ్ ,విద్యా మనోవి జ్ఞానశాస్త్రము– ఎలిమెంటరీ ఉపాధ్యాయ విద్య, తెలుగు అకాడమి,హైదరాబాద్ ,

6.డా..ద్వానాశాస్త్రి ,తెలుగుసాహిత్య చరిత్ర ,విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్ ,1998